సాక్షి
మెదక్
గురువారం ! 22 ! ఫిబ్రవరి ! 2024



ఔరా.. వాడువీడేనా!

ఆ గ్రామంలోని పది కుటుంబాల్లో కవల పిల్లలున్నారు. కవల పిల్లల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.. వివరాలు 8లో ▸



జాగ్రత్తలు తప్పనిసరి

పిచికారీ తర్వాత స్ప్రేయర్లను శుభ్రం చేయాలి. లేకుంటే పంటలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. వివరాలు 9లో ▸

రేపు ఇంటర్వ్యూలు

మెదక్ కలెక్టరేట్: గ్రామాల్లో పనిచేసే మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ) పోస్టుల భర్తీకి ఈనెల 23న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని జిల్లా వైద్యాధికారి చందూనాయక్ బుధవారం తెలిపారు. మొత్తం 10 పోస్టులు ఉన్నట్లు తెలిపారు. ఎంబీబీఎస్/ఆయుష్(బీఏఎంఎస్) వైద్యులు అర్హులని జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

రాజీయే రాజమార్గం

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద



మాట్లాడుతున్న లక్ష్మీశారద

మెదక్: వచ్చేనెల 9న జాతీయ లోక్‌అదాలత్‌లో భాగంగా జిల్లాలోని పెండింగ్ కేసులను పరిశీలించి ఎక్కువ కేసులను రాజీ చేసేలా ప్రయత్నం చేయాలని, ఇందుకు న్యాయవాదులు సహకరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీ శారద తెలిపారు. బుధవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ముఖ్యంగా బ్యాంకు రుణాలతోపాటు ఇతర సమస్యలు, బీమా కౌన్సిల్స్, చిట్‌ఫండ్ కౌన్సిల్స్ విషయమై ఎక్కువగా కేసులు ఉంటాయన్నారు. ఈ సదావకాశాన్ని కక్షిదారులు వినియోగించుకుని ఎక్కువ మొత్తంలో రాజీ కుదుర్చుకోవాలన్నారు. మోటారు వెహికల్ యాక్సిడెంట్ కేసులు, భార్యాభర్తల కేసులు, కుటుంబ తగాదాలను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి జితేందర్, జూనియర్ సివిల్ జడ్జి రీటా లాల్‌చంద్, జూనియర్ సివిల్ జడ్జి కల్పన, న్యాయవాదులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి నలుగురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు



మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు

రామాయంపేట(మెదక్): బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన నలుగురు మున్సిపల్ కౌన్సిలర్లు బుధవారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. కౌన్సిలర్లు దేమె యాదగిరి, సుందర్‌సింగ్, చిలుక గంగాధర్, దేవుని జయరాజు ఉదయమే హైదరాబాద్‌లోని మైనంపల్లి ఇంటికి వెళ్లి ఆయన ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సహకారంతో తమ వార్డులను అభివృద్ధి చేసుకోవడానికే పార్టీలో చేరామని ప్రకటించారు. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 12 మంది కౌన్సిలర్లకుగాను బీఆర్‌ఎస్ 8, కాంగ్రెస్ 2, బీజేపీ 1, ఇండిపెండెంట్ అభ్యర్థి ఒకరు గెలుపొందారు. అప్పుడు.. కాంగ్రెస్ నుంచి గెలిచిన చింతల రాధాభవానీ, బొర్ర అనిల్‌కుమార్, బీజేపీ నుంచి గెలిచిన సుందర్‌సింగ్, స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన చిలుక గంగాధర్ తరువాత బీఆర్‌ఎస్‌లో చేరడం తెలిసిందే.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

● డీఈఓ రాధా కిషన్



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ రాధాకిషన్

పెద్దశంకరంపేట (మెదక్): ఎస్‌ఎస్‌సీ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాధికారి రాధా కిషన్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం వారి హాజరు శాతాన్ని పరిశీలించారు. ఆపై మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మ్యాథ్స్, సైన్స్, తెలుగు విషయాలపై ప్రశ్నలు అడిగారు. పరీక్షలంటే భయాందోళనలు చెందవద్దని ప్రశాంతంగా రాయాలన్నారు. కార్యక్రమంలో మండల అధికారి వెంకటేశం, రాజేశ్వర్, విఠల్, ప్రిన్సిపాల్ విఠల్ నాయక్, ప్రసన్నకుమార్, విజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

తూప్రాన్: మండలంలోని ఎరువుల దుకాణాల్లో జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ బుధవారం తనిఖీలు చేశారు. షాపుల్లో నిల్వ చేసిన యూరియా, డీఏపీ, కాంప్లెక్స్, ఎరువుల వివరాల రికార్డులను పరిశీలించారు. రైతులకు వాటి కొరత రాకుండా చర్యలు చేపట్టాలని దుకాణాదారులకు సూచించారు. ఈ–పోస్ ద్వారానే విక్రయాలు చేయాలన్నారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు, కాలంచెల్లిన పురుగుల మందులను విక్రయించరాదన్నారు.

2 నెలలు.. 150 చోరీలు

తాళం వేసిన ఇళ్లే టార్గెట్
- రాత్రి పగలు తేడా లేకుండా చోరీలు
- హడలెత్తిస్తున్న దొంగలు
- బెంబేలెత్తుతున్న ప్రజలు



మెదక్: జిల్లాలో వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రెండు నెలల కాలంలో సుమారు 150 చోరీలు జరగడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాళం వేసిన ఇళ్లనే టార్గెట్ చేస్తున్నారు. మరోవైపు దారి దోపిడీకి పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. ప్రజలు రెక్కలు ముక్కలు చేసుకుని పైసా పైసా కూడబెట్టుకున్న సొమ్మును అప్పనంగా దోచేస్తున్నారు.

4 రోజుల వ్యవధిలో ఘటనలు

■ ఈనెల 17న, సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం పెద్ద చెప్యాల గ్రామానికి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి చేగుంట మండల కేంద్రంలో ఉంటున్న మిత్రుడికి రూ.5 లక్షలు ఇచ్చేందుకు కారులో వచ్చారు. వాహనాన్ని పార్కు చేసి హోటల్‌లో టీ తాగేందుకు లోపలికెళ్లి తిరిగొచ్చే లోపు నలుగురు దుండగులు కారు అద్దాలను పగులగొట్టి డబ్బుతో ఉడాయించారు.

■ 17న కొల్చారం మండలం చిన్నఘనాపూర్‌కు చెందిన వెంకటపురం బాలయ్య ఇంటికి తాళం వేసి ఊరెళ్లాడు. అర్ధరాత్రి తాళం పగులగొట్టి ట్రంకు పెట్టెలో దాచిన రూ.1.50 లక్షలతో పాటు అర తులం బంగారం, 30 తులాల వెండిని ఎత్తుకెళ్లారు. అదే రాత్రి వడ్ల లక్ష్మీనారాయణ ఇంటి తాళం సైతం పగులగొట్టి బీరువాలో దాచిన నగదును తస్కరించారు.

■ అదేరోజు.. తూప్రాన్ మండలం వెంకటాయిపల్లిలో మూడిళ్లలో చోరీ చేశారు. గ్రామానికి చెందిన చిన్నలంబ మహేశ్ ఇంటికి తాళం వేసి ఊరెళ్లాడు. వేసిన తాళాన్ని పగులగొట్టి బీరువాలో దాచిన తులంన్నర బంగారు ఆభరణాలు, 30 తులాల వెండి, రూ.లక్ష నగదు ఎత్తుకెళ్లారు. అలాగే ఇదే గ్రామానికి చెందిన శీలదారు సత్యనారాయణ ఉద్యోగ రీత్యా మనోహరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. ఇంట్లో దాచిన రూ. 5 వేలను తస్కరించారు. కిష్టారం పెంటయ్య ఇంటి తాళం పగులగొట్టి లోపలకి చొరబడ్డారు. ఏం దొరక్కపోవడంతో వస్తువులను చిందరవందరగా పడేశారు.

■ 19న చేగుంటకు చెందిన ఓ విశ్రాంత ఉద్యోగి రామచంద్రం స్కూటీపై శివారులోని రెడ్డిపల్లి బైపాస్ వంతెన నుంచి మండల కేంద్రం వైపు వస్తుండగా పోలీసులమని ఇద్దరు బెదిరించి రెండు బంగారు ఉంగరాలను దోచుకెళ్లారు.

■ 20న రామాయంపేటలో చేగుంట మండలం బోనాలకొండాపూర్‌కు చెందిన గంధం చంద్రయ్య మంజీరా స్కూల్ ఎదురుగా ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. తన భార్యను బస్సు ఎక్కించేందుకు బస్టాండ్‌కు వెళ్లి వచ్చే లోపే ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో దాచిన రూ.5.30 లక్షలను చోరీ చేశారు.

తాజాగా..

■ ఈనెల 20 రాత్రి మెదక్–చేగుంట ప్రధాన రహదారి ఖాజీపల్లి బస్టాండ్ వద్ద గ్రామానికి చెందిన సాహెబీ కిరాణా దుకాణంతోపాటు హోటల్ నడుపుతోంది. ఆ రోజు రాత్రి షట్టర్ పగులగొట్టి షాపులో దాచిన రూ.7 వేల నగదు అపహరించుకుపోయారు. నిత్యం ఎక్కడో ఒక చోట దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి.



సిబ్బందిని ఆరా తీస్తున్న కలెక్టర్ రాజర్షిషా

డుమ్మా కొడితే దండన

- విధుల్లో నిర్లక్ష్యం తగదు
- అధికారులకు కలెక్టర్ హెచ్చరిక

కౌడిపల్లి(నర్సాపూర్): వైద్య సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ రాజర్షి షా హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలో ఉన్న పీహెచ్‌సీ, సీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బంది హాజరు రిజిస్టర్ పరిశీలించారు. మండల వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, సూపర్‌వైజర్లు, స్టాఫ్ నర్సులు హాజరు కాగా సూపరింటెండెంట్ మధు, మహిళా డాక్టర్ ఫెర్నాజ్, ఇద్దరు స్టాఫ్ నర్సులు గైర్హాజరయ్యారు. సెలవులో ఉన్నట్లు చెప్పినా సరైన సెలవు పత్రాలు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజిస్టర్‌లో ఉన్న పేర్లను ఒక్కొక్కటీగా పిలిచి ఎక్కడున్నారని ప్రశ్నించారు. అనంతరం ఆస్పత్రిని పరిశీలించి యాంటీబయోటిక్స్ ఇతర మందుల గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడారు. రాత్రిపూట డాక్టర్ అందుబాటులో ఉండటం లేదన్నారు. రాత్రి లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. రాత్రి డెలివరీ కేసులు వస్తే వైద్యం ఎవరు చేస్తారని అడగగా స్టాఫ్ నర్స్ చేస్తుందన్నారు. సమస్య వస్తే పరిస్థితి ఏమిటని అడుగగా ఫోన్‌లో డాక్టర్ స్పందించి పరిష్కరిస్తారన్నారు. ఇది సరికాదని అందుబాటులో ఉండాలన్నారు. అకౌంటెంట్ సైతం అందుబాటులో ఉండరని ఆయన దృష్టికి వచ్చింది. వైద్యసిబ్బంది హాజరు, విధులకు సంబంధించి నేమ్ బోర్డు రాసి పెట్టాలని ఆదేశించారు.

సంజాయిషీ ఇవ్వాలి

విధులకు గైర్హాజరైన సూపరింటెండెంట్, డాక్టర్‌తో పాటు ఇద్దరు స్టాఫ్‌నర్సులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. డీఎంహెచ్‌ఓకు అధికారులు సరైన సంజాయిషీ ఇవ్వాలని లేకపోతే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందుతుందన్నారు. కౌడిపల్లి ఆస్పత్రి జాతీయ రహదారి పక్కన ఉందని మెరుగైన వైద్య సేవలు అందేలా చూస్తామన్నారు. సీహెచ్‌సీకి కొత్తగా ఏడుగురు స్టాఫ్‌నర్సులు వచ్చారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయ నిర్మల, సీహెచ్‌ఓ ఎలిజబెత్, సూపర్‌వైజర్లు మార్త, రమేష్, ఆర్‌ఐ శ్రీహరి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మంజీరా పరివాహక ప్రజలు అలర్ట్

- సింగూరు నుంచి నీరు విడుదల
- ఎస్పీ బి.బాలస్వామి

మెదక్ మున్సిపాలిటీ: సింగూరు నీరు విడుదల చేసినందున మంజీరా పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ డాక్టర్ బాలస్వామి తెలిపారు. బుధవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం నీరు సింగూరు నుంచి నీరు విడుదల చేస్తున్నందునా ఏడుపాయలలో నీరు ఉధృతంగా ప్రవహిస్తుందన్నారు. దీంతో పరివాహక ప్రాంతం ప్రజలు, రైతులు అటువైపు రాకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. పశువులు, గొర్రెల కాపరులు కూడా జీవాలను తోలవద్దని సూచించారు. ఒకవేళ ఎవరికైనా ఏమైనా ఇబ్బందులుంటే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు. డ్యామ్‌లు, చెరువులు, కుంటలు, అలుగులు పారే ప్రదేశాలను అధికారులు గుర్తించి ఎప్పటికప్పుడూ పర్యవేక్షించాలన్నారు. విపత్కర పరిస్థితులు ఎదురైతే ప్రజలు డయల్ 100, పోలీస్ స్టేషన్, పోలీస్ కంట్రోల్ రూమ్ 87126–57888 నంబర్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. వారి యోగక్షేమాల కోసం ఎల్లప్పుడూ పోలీస్ శాఖ పని చేస్తోందన్నారు.

ఆన్‌లైన్‌లో తప్పులు దొర్లవద్దు

ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి విజయలక్ష్మి



మెదక్ కలెక్టరేట్: విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో అనేక తప్పులు దొర్లడంతో స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రక్రియ ఆలస్యమవుతోందని జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి తెలిపారు. బుధవారం సాక్షితో ఆమె మాట్లాడుతూ, జిల్లాలో 3 వేల మంది లబ్ధి పొందనున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆపై బ్యాంక్ ఖాతాలు జత చేయక పోవడం వల్ల సమస్య అవుతోందన్నారు. జిల్లాలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ, డైట్, ఇంజినీరింగ్, డిప్లొమా, డిగ్రీ చదువుతున్న ఎస్సీ విద్యార్థులు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. నిబంధనల ప్రకారం ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. మార్చి నెలాఖరులోపు ఆయా కళాశాలల యాజమాన్యాలు, ప్రధానోపాధ్యాయులు దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.

మాదిగలను మోసం చేసిన బీజేపీ

- మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు రవి
- పట్టణంలోకి జోడో యాత్ర

మెదక్: మాదిగలను మోసం చేసిన బీజేపీని అంతం చేయడమే తమ లక్ష్యమని మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు పిడమర్తి రవి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని గోల్కొండ వీధికి మాదిగల జోడో యాత్ర చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగితే మాదిగల ఓటు బ్యాంక్ దండుకోవడానికి హైదరాబాద్ వచ్చిన ప్రధాని మోదీ.. పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెడతామని ఆశ చూపారన్నారు. ఆ విధంగా ఆరు అసెంబ్లీ స్థానాలను గెలుచుకున్న పార్టీ, మరోసారి పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగ ఓటు బ్యాంక్ దోచుకోవడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో ఉన్న మాదిగలు బీజేపీని భూస్థాపితం చేస్తేనే వర్గీకరణ బిల్లు పార్లమెంట్లో ప్రవేశపెడతారన్నారు. రాష్ట్రంలో ఎస్సీ రిజర్వు స్థానాల్లో రెండు పార్లమెంటు స్థానాలు.. ఒక జనరల్ స్థానం కేటాయించాలని డిమాండ్ చేశారు.

లక్ష సంపాదించేలా ప్రోత్సాహం

● జిల్లా గ్రామీణాభివృద్ధి అదనపు అధికారి సూర్యారావు



మాట్లాడుతున్న సూర్యారావు

నర్సాపూర్: స్వయం సహాయక సంఘాలలోని మహిళా సభ్యులను లక్షాధికారులుగా చేసేందుకు ఐకేపీ సిబ్బంది కృషి చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అదనపు అధికారి సూర్యారావు సూచించారు. బుధవారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో నర్సాపూర్, శివ్వంపేట మండలాలకు చెందిన ఐకేపీ ఏపీఎంలు ఇతర సిబ్బంది శిక్షణ కార్యక్రమానికి హాజరై ఆయన మాట్లాడారు. గ్రామ మహిళా సంఘాలలోని 80 మందిని వచ్చే రెండేళ్లలో ఏడాదికి లక్ష ఆదాయం సాధించేలా తీర్చిదిద్దాలన్నారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్లో గ్రామీణ ప్రాంతాల్లోని పేద మహిళలను లక్షాధికారులను చేసేలా లఖ్ పతి దీదీ అనే పథకాన్ని ప్రకటించారని గుర్తుచేశారు. ఇది స్వయం సహాయక గ్రూపులో ఉండే సభ్యులకు వర్తిస్తుందని వివరించారన్నారు.

బీఆర్‌ఎస్‌కు సొసైటీ చైర్మన్ రాజీనామా

చేగుంట(తూప్రాన్): బీఆర్‌ఎస్‌కు రెడ్డిపల్లి సహకార సంఘం చైర్మన్ మ్యాకల పరమేశ్ బుధవారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా ప్రభాకర్‌రెడ్డిని అందరం కలిసి గెలిపించుకున్నామన్నారు. కానీ పార్టీలో కొందరికే ప్రాధాన్యత కల్పిస్తున్నారని విమర్శించారు. ఇటీవల జరిగిన పార్టీ కార్యక్రమాలకు పిలవడం లేదన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు తగిన ప్రయారిటీ లేనందున రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

స్కాలర్‌షిప్ విడుదల చేయాలి

- ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా
- ఏబీవీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

మెదక్ కలెక్టరేట్: ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు శశికాంత్ మండిపడ్డారు. బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో మెదక్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు స్కాలర్‌షిప్ విడుదల చేయక పోవడమంటే విద్యకు దూరం చేయడమేనన్నారు. వాటి కోసం వారిని ప్రైవేట్ ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాల యజమాన్యాలు మానసికంగా వేధిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన విద్యార్థుల ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలేనని ఆరోపించారు. అధికారంలోకి రాగానే స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేస్తానని హామీలిచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తుతం ఆ విషయాన్ని మర్చిపోయారన్నారు. రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ దిగొచ్చే వరకు విద్యార్థుల తరఫున ఏబీవీపీ పోరాడుతుందన్నారు. తొలుత అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉదయ్, మల్లేశం, కార్తికేయ, నరేష్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

మా ఆకలి కేకలు వినపడవా?



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది

- జీపీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ధర్నా

మెదక్ కలెక్టరేట్: మా (గ్రామ పంచాయతీ సిబ్బంది) ఆకలి కేకలు ప్రభుత్వానికి వినపడవా? అని సీఐటీయూ జిల్లా కోశాధికారి కడారి నర్సమ్మ ప్రశ్నించారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికులతో కలిసి ఆమె ధర్నా నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ, మూడు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించాలన్నారు. కొన్ని గ్రామాల్లో ఉన్న వర్కర్లను అధికారులు ఇబ్బందులు పెడుతున్నారన్నారు. మధ్యాహ్న భోజనం చేయడానికి గంట సమయం కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్‌లు కాల పరిమితి ముగిసిందని చెబుతూ పలుచోట్ల విధులు నిర్వహిస్తున్న కార్మికులను విధుల నుంచి తొలగిస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదని హితవుపలికారు. కార్యక్రమంలో జిల్లా గ్రామ పంచాయతీ జిల్లా కార్యదర్శి ఆసీఫ్, పంచాయతీ సంఘ సభ్యులు శేఖర్, పద్మారావు, సిద్ధిరాములు, సత్యం, ఎల్లం, సామెల్, లింగం, సాయిలు, నర్సింహులు, మరియమ్మ, లక్ష్మయ్య, రాములు, సంతోష్, కృష్ణయ్య, స్వామి తదితరులున్నారు.



భారీ బోనం ఎత్తుకున్న ఒగ్గుపూజారి



ఎల్లమ్మా.. దీవించమ్మా

కౌడిపల్లి మండల కేంద్రంలో గోకుల్ యాదవ సంఘం ఆధ్వర్యంలో మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా బుధవారం ఒగ్గుపూజారులు ఎల్లమ్మదేవి కల్యాణం ఘనంగా నిర్వహించారు. రాత్రి ఎల్లమ్మదేవి యాదవ సంఘం సభ్యులతోపాటు మహిళలు బోనాలు తీసి మొక్కులు చెల్లించుకున్నారు. ఒగ్గుపూజారి శేఖర్ ఎత్తుకున్న భారీ బోనం ఆకట్టుకుంది. ముందుగా శివసత్తుల నృత్యాలు, డోలు చప్పుళ్లతో ఆ ప్రాంతమంతా మారుమోగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్)



బోనాలతో మహిళలు

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయికి ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మర్కూక్(గజ్వేల్): రాష్ట్రస్థాయి సైన్స్ టాలెంట్ పోటీలకు మండలంలోని పాములపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి నాగచైతన్య రెడ్డి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు లతీస్రైదా తెలిపారు. ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ద్వితీయస్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య


మృతదేహాన్ని బయటకు తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జహీరాబాద్ టౌన్: బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రమైన మొగుడంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. చిరాగ్‌పల్లి ఎస్ఐ నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మొగుడంపల్లికి చెందిన పోచప్ప కుమారుడైన రాజు(28)కు భార్యతోపాటు నలుగురు పిల్లలు ఉన్నారు. రాజు తాగుడుకు అలవాటు పడి తరుచూ భార్యతో గొడవపడే వాడు. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లింది. అప్పటి నుంచి మనస్తాపానికి గురై బుధవారం అతిగా మద్యం సేవించి గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. జహీరాబాద్ అగ్నిమాపక అధికారి ప్రశాంత్, సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నీళ్ల కోసం వెళ్లి బావిలో పడి..

టేక్మాల్(మెదక్): ప్రమాదవశాత్తు మహిళ బావిలో పడిన ఘటన టేక్మాల్ మండలంలోని ఎల్లంపల్లిలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ తుక్కయ్య వివరాల ప్రకారం.. ఎల్లంపల్లి గ్రామానికి చెందిన కొండి అనిత (35) వ్యవసాయ పనులతోపాటు మేకలు కాస్తూ జీవనం సాగిస్తుంది. బుధవారం సాయంత్రం నీళ్లకోసం వాటర్ బాటిల్ తీసుకొని టేక్మాల్ శివారులోని పాత్రోపులోని బాయి వద్ద వెళ్లింది. ఎంతకు తిరిగి రాకపోవడంతో ఆమెతోపాటు మేకలు కాస్తున్న మరో వ్యక్తి బావి వద్దకు వెళ్లి చూడగా గడ్డపై గొడ్డలి, బావిలో చెప్పులు, వాటర్ బాటిల్ చూసి బావిలో పడిందని ఇరుగు పొరుగువారిని పిలిచాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి గాలింపు చర్యలు చేపట్టారు. ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు.

పిల్లల్ని ఎత్తుకెళ్తున్నాడని..

స్తంభానికి కట్టేసి దేహశుద్ధి

సంగారెడ్డి అర్బన్: పిల్లలను ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించాడని ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటన సంగారెడ్డిలో బుధవారం చోటు చేసుకుంది. బైపాస్ రోడ్డులో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని చూసి పిల్లల్ని కిడ్నాప్ చేసేందుకు వచ్చాడని భావించిన స్థానికులు స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి వచ్చి వ్యక్తిని స్టేషన్ కు తీసుకెళ్లారు.

ఔరా.. వాడు వీడేనా..!

ఒకే ఊరిలో పది మందికిపైగా కవలలు

- పోలికలతో ముచ్చటగొల్పుతున్న ట్విన్స్
- రూపురేఖలు ఒకేలా.. చూస్తే తికమక
- తాతముత్తాతల కాలం నుంచే జననం
- పెళ్లయినా వీడని బంధాలు
- శేరిపల్లి గ్రామంలో చిత్ర విచిత్రంగా


నేడు అంతర్జాతీయ కవలల దినోత్సవం

ఇంట్లో కవల పిల్లలుంటే ఆ కిక్కే వేరు. అలాంటిది పదిళ్లల్లో కవలలున్నారంటే.. వినడానికి అతిశయోక్తి అనిపించినా.. ఈ అపురూప దృశ్యం చూసిన వారు మాత్రం ముక్కున వేలేసుకుంటారు. ఒకే పోలిక, ఒకే రకమైన దుస్తులు, నడక, మాట తీరు, హావభావాలు చూస్తుంటే ముచ్చటగొలుపుతుంది. తక్కున వీరిని చూస్తే గుర్తుపట్టడం కష్టతరమవుతుంది. ఔరా.. వాడు వీడేనా..! అని విస్మయగొలుపుతుంది. విచిత్రమేమిటంటే.. ఒక ఇంట్లో అయితే.. తాతముత్తాల కాలం నుంచి కవలలు పుట్టడం గమనార్హం. నార్సింగి మండలం శేరిపల్లి గ్రామంలో ఉన్న పరిస్థితిపై నేడు అంతర్జాతీయ కవలల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

– చిన్నశంకరంపేట (మెదక్)


లక్ష్మయ్య మనుమళ్లు రామ్, లక్ష్మణ్


సాయి సహస్ర, సాయి సంపత్

ఎవరు పుట్టినా రామ-లక్ష్మణులే

ఆ ఇంట తాత ముత్తాతల కాలం నుంచి కవలలకు జన్మనివ్వడం జరుగుతుంది. శేరిపల్లి గ్రామంలోని గజ్వేల్లి రామయ్య, లక్ష్మయ్యలు కవలలుగా జన్మించారు. ఇందులో లక్ష్మయ్య దంపతులకు కవలలు పుట్టగా వీరి పేర్లు కూడా రాములు, లక్ష్మయ్యలనే పెట్టారు. ఒకే రూపు ఒకే మాటతీరుతో గ్రామంలో వీరు ప్రత్యేకంగా నిలిచారు. వీరిని గుర్తుపట్టడం కష్టంగా మారడంతో ఒకరు తలపాగ చుట్టుకోగా, మరొకరు చేతికి వెండ ఆభరణం పెట్టుకొని కనిపిస్తుంటారు. ఇందులో మళ్లీ గజవెల్లి లక్ష్మయ్య కుమారుడు రామచంద్రం–సులోచన దంపతులకు కవలలు పుట్టగా.. వీరి పేరు కూడా రామ్, లక్ష్మణ్ పెట్టుకొని మురిసిపోయారు. అలాగే, రాములు కుమారుడు నాగరాజు–లత దంపతులకు కూడా కవలలు పుట్టారు. ఇందులో ఒకరు బాబు, మరొకరు పాప పుట్టారు. తాత ముత్తాల కాలం నుంచి వీరి ఇంట కవలలు జన్మిస్తున్నారు.

పెళ్లయినా.. ఒకే దగ్గర పుట్టిన రోజు


పుట్టిన రోజు జరుపుకుంటున్న సౌమ్య, రామ్

శేరిపల్లి గ్రామంలో శివ్వోల చంద్రం–వెంకటలక్ష్మి జంటకు సైతం కవలలు జన్మించారు. వీరు పేర్లు సాయి రామ్, సౌమ్య ఇద్దరు ఒకే రకం పోలికలతో ఉండడంతోపాటు ఒకే అభిరుచులతో పెరిగారు. మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివిన వీరు మంచి అభిరుచులతో ముందుకు సాగుతున్నారు. సౌమ్య వివాహం కాగా, రామ్ బీఎడ్ పూర్తి చేశారు. ప్రస్తుతం షార్ట్ ఫిల్మ్ యాక్టర్, డైరెక్టర్‌గా పని చేస్తున్నాడు. సౌమ్య పెళ్లి అయ్యి అత్తగారి ఇంటి వద్ద ఉంటున్నప్పటికీ ఒకే రకం దుస్తులు ధరించి, పుట్టిన రోజు ఒకే దగ్గర జరుపుకుంటున్నారు.

ఇద్దరూ ఒకే రోజు పెళ్లి..


రామ్, లక్ష్మణ్‌ల పెళ్లి వేడుక

పుట్టిన రోజు వేడుకలే కాదు పెళ్లి కూడా ఒకే రోజు నిర్వహిస్తే ఆ సన్నివేశం కనులవిందుగా ఉంటుంది. శేరిపల్లి గ్రామానికి చెందిన శ్రీరామ్ ముత్యాలు, లక్ష్మి దంపతులకు మూడో సంతానంగా కవలలు జన్మించారు. వీరు పేర్లు రామ్ లక్ష్మణ్‌లు వీరు ఒకే పోలికలతో ఉండడంతో పాటు ఒకే అభిరుచితో ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలోనే ఇద్దరు ఒకే రోజు పెళ్లి చేసుకొని ఆనందం పంచుకున్నారు. 2016 మార్చి 16న రామ్ లావణ్యను, లక్ష్మణ్ జ్యోతిని వివాహం చేసుకొని పెద్ద పండుగా చేసుకున్నారు. పెళ్లికి వచ్చిన వారందరూ ఆశ్చర్యంతో పాటు పెళ్లి కూతుళ్లను ఆటపట్టించిన వారే.

మరికొందరు కవలలు

- గ్రామానికి చెందిన తాళ్ల నర్సాగౌడ్, లక్ష్మి దంపతులకు ఇద్దరు ఆడబిడ్డలు కవలలు పుట్టగా వారికి మంగ, పద్మ పేర్లు పెట్టారు. వీరు ఇద్దరు కూడా పెళ్లి చేసుకొని గృహిణులుగా జీవిస్తున్నారు.
- సందిగారి చంద్రాగౌడ్, భవానీలకు ఇద్దరు కవలలు జన్మించగా వారి పేర్లు భవ్యశ్రీ, భవిష్యలు జన్మించారు. రాచపల్లి దుర్గయ్య, బాలమణిలకు కవలలుగా ఒక బిడ్డ, కుమారుడు జన్మించారు. వారి పేర్లు రామ్, లక్ష్మి గా నామకరణం చేశారు.
- కామారంంలో పూలపల్లి యాదగిరి, మంజుల దంపతులకు ఇద్దరు కుమారులు కవలలుగా పుట్టారు. వీరు పేర్లు రామ్, లక్ష్మణ్‌లే..


రామ్, లక్ష్మణ్

వీరిద్దరికీ ఒకే రకం డ్రస్‌లు వేసి తమ ముచ్చట తీర్చుకుంటున్నారు. పాఠశాల కల్చరల్ ప్రోగ్రామ్స్‌లోనూ వీరు రామ్, లక్ష్మణ్ పాత్రలను ఎంచుకొని తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ప్రస్తుతం ఇద్దరు కూడా ఇంటర్ ప్రతిభను చాటి ఐఐటీకి లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుంటున్నారు.

స్నేహితులే నిందితులు

మిత్రుడిని మోసగించి రూ.5 లక్షలు చోరీ

రామాయంపేట(మెదక్): తమను నమ్మిన మిత్రుడిని మోసగించి డబ్బులు ఎత్తుకెళ్లిన ఇద్దరు స్నేహితులని పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక సీఐ వెంకటేశ్ మంగళవారం రాత్రి విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. రామాయంపేట పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో ఉంటున్న గందం చంద్రయ్య భార్యకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో వైద్యం కోసం స్వగ్రామమైన చేగుంట మండలం బోనాల కొండాపూర్‌లో కొంత భూమిని అమ్మాడు. స్థలం కొనుగోలు చేసిన అదే గ్రామానికి చెందిన అంజిరెడ్డి మంగళవారం డబ్బులివ్వడానికి రామాయంపేట వచ్చాడు. చంద్రయ్య తన స్నేహితులైన కామారెడ్డి జిల్లా బిక్కనూర్ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన మన్నె శ్రీనివాస్, ఇరుపాక రవీందర్ రెడ్డిని పిలిపించుకున్నాడు. వారిద్దరి సమక్షంలో రూ.5 లక్షలు తీసుకున్న చంద్రయ్య డబ్బులు బీరువాలో దాచాడు. ఎలాగైనా ఆ డబ్బులు కాజేయాలని చంద్రయ్య స్నేహితులు పథకం వేశారు. భార్య ఇంట్లో లేని సమయంలో పథకం ప్రకారం మన్నె శ్రీనివాస్ వచ్చి చంద్రయ్యను బైక్‌పై ఎక్కించుకొని వెళ్లాడు. వారిద్దరూ వెళ్లిపోగానే రవీందర్‌రెడ్డి చంద్రయ్య ఇంటికొచ్చి తాళాలు పగులగొట్టి బీరువాలో దాచి ఉంచిన నగదును ఎత్తుకెళ్లాడు. చంద్రయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానంతో శ్రీనివాస్, రవీందర్ రెడ్డిని కస్టడీలో తీసుకొని తమదైన శైలిలో విచారించగా నేరం ఒప్పుకున్నారు. ఇద్దరి నుంచి రూ.5 లక్షల నగదుతోపాటు రెండు బైక్‌లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకటేశ్

కొడుకు మరణం తట్టుకోలేక..

మనోవేదనతో తండ్రి మృతి


బాలమల్లు (ఫైల్)

నంగునూరు(సిద్దిపేట): ఇటీవల హత్యకు గురైన కుమారుడిని తలచుకుంటూ తండ్రి మృతి చెందిన ఘటన బుధవారం నంగునూరు మండలం ఘనపూర్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు బండి వెంకటయ్య కొద్ది రోజుల కిందట హత్యకు గురయ్యాడు. దీంతో తండ్రి బండి బాలమల్లు (90) కుమారుడిని తలుచుకుంటూ నిత్యం రోదిస్తూ మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే హరీశ్‌రావు వెంకటయ్య కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వస్తున్నాడని తెలిసి తన కుమారుడిని అన్యాయంగా పొట్టన పెట్టుకున్నారంటూ రోదిస్తూ కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందాడు. కొద్ది సేపటికే అక్కడికి చేరుకున్న హరీశ్‌రావు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యాడు. వెంకటయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చాడు. అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. రోజుల వ్యవధిలోనే ఒకే ఇంట్లో ఇద్దరు మృతి చెందడంతో ఆ ఇంట విషాదం నెలకొంది.

కన్నవారి ఎదుటే కానరాని లోకాలకు..

తల్లిదండ్రులు చూస్తుండగా లారీ ఢీకొని బాలుడు మృతి


రుత్విక్ (ఫైల్)

కొండపాక(గజ్వేల్): లారీ ఢీకొట్టడంతో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన కుకునూరుపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండపాక మండలంలోని అంకిరెడ్డిపల్లికి చెందిన తలపాక కిషన్, లావణ్య దంపతులకు రిత్విక్ (6), దాసు ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరంతా బుధవారం లావణ్య తల్లిగారి ఊరైన కుకునూరుపల్లి మండలం మాత్‌పల్లి గ్రామానికి బోనాల జాతరకు బస్సులో వెళ్తున్నారు. ఈ క్రమంలో కుకునూరుపల్లి బస్టాండ్‌లో బస్సు దిగి మాత్‌పల్లి గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు దాటుతున్నారు. ఇదే సమయంలో హైదరాబాద్ నుంచి సిద్దిపేట వైపున వెళ్తున్న లారీ రుత్విక్‌ను బలంగా ఢీకొట్టింది. తీవ్ర గాయాతో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. కళ్ల ఎదుటే కుమారుడు మృతి చెందడంతో తల్లిండ్రుల రోదనలు అక్కడి వారిని కంటతడి పెట్టించాయి. విషయం తెలుసుకున్న కుకునూరుపల్లి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి తల్లి లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని కొమురంభీమ్ జిల్లాకు చెందిన లారీ డ్రైవరు కొట్నూరు నగేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

దూసుకొచ్చిన మృత్యువు

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి
- లిఫ్ట్ అడిగి ప్రాణాలు పోగొట్టుకున్న డిగ్రీ విద్యార్థి అరుణ్
- మరొక విద్యార్థికి తీవ్ర గాయాలు


చికిత్స పొందుతున్న డిగ్రీ విద్యార్థి దిలీప్


అరుణ్ (ఫైల్)


అయాన్ (ఫైల్)

గజ్వేల్‌రూరల్: పుస్తకాలు కొనుక్కుందామని బయలుదేరిన ఇద్దరు మిత్రులు మార్గమధ్యలో ఓ యువకుడిని లిఫ్ట్ అడిగారు. కొద్దిదూరం వెళ్లగానే వీరు ప్రయాణిస్తున్న వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. దీంతో వాహనం నడుపుతున్న యువకుడితో పాటు మరొకరు మృతి చెందారు. ఈ సంఘటన బుధవారం గజ్వేల్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. దౌల్తాబాద్ మండలం శేరుపల్లి బందారం గ్రామానికి చెందిన శ్రీను, మంజుల దంపతుల చిన్నకొడుకు అరుణ్(20), రామాయంపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన దేవయ్య–మమత దంపతుల రెండో కుమారుడు దిలీప్ గజ్వేల్‌లోని బీసీ హాస్టల్‌లో ఉంటూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. వీరిద్దరు మంచి స్నేహితులు. సెమిస్టర్ పరీక్షలు దగ్గర పడుతుండటంతో పుస్తకాలను కొనుగోలు చేసేందుకు బుధవారం ఉదయం హాస్టల్ నుంచి బయలుదేరారు. ఈ క్రమంలో గజ్వేల్‌కు చెందిన అయాన్(19) సంగాపూర్ నుంచి గజ్వేల్ వైపు స్కూటీపై వెళ్తున్నాడు. ఇదే సమయంలో అరుణ్, దిలీప్‌లు లిఫ్ట్ అడగడంతో అయాన్ వారిని స్కూటీపై ఎక్కించుకొని బయలుదేరాడు. మార్గమధ్యలో వీరు ప్రయాణిస్తున్న వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. దీంతో ప్రమాదస్థలిలోనే అరుణ్ మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన అయాన్‌ను కుటుంబ సభ్యులు హైదరాబాద్ తీసుకెళుతుండగా మార్గమధ్యలో ప్రాణాలొదిలాడు. దిలీప్‌ను నిమ్స్‌కు తరలించారు. గజ్వేల్ ఏసీపీ బాలాజీ ఘటనాస్థలాన్ని పరిశీలించారు.

లిఫ్ట్ ఇవ్వడమే శాపమైందా..?: కుటుంబీకులు

అయాన్ మదర్సాలో విద్యనభ్యసించి నాలుగు నెలల క్రితమే పట్టణంలోని ఓ బట్టల దుకాణంలో చేరాడు. లిఫ్ట్ ఇవ్వడమే శాపమైందా అంటూ అయాన్ తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమయ్యారు.



పోలీసై వస్తాడనుకున్నా..

అరుణ్ తల్లి మంజుల

ఇయ్యాల పొద్దునే తండ్రితో ఫోన్‌లో మాట్లాడిండు. మంచిగ సదువుకుంటున్న.. పోలీసు కొలువు సాధించి కష్టాలు తీరుస్తానన్నాడు. ఇప్పుడు మాకు దూరమయ్యావా బిడ్డా అంటూ అరుణ్ తల్లి మంజుల రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. అరుణ్ మరణ వార్తతో స్నేహితులు, కుటుంబ సభ్యులంతా దుఃఖసాగరంలో మునిగిపోయారు.

చురుకైన విద్యార్థి

అరుణ్ చదువులో చురుకైన విద్యార్థి. ఇటీవలే ఎన్‌సీసీకి సంబంధించిన ఎగ్జామ్–బీ ఉత్తీర్ణుడయ్యాడు. చదువులో ముందుంటూ ఎన్‌సీసీలో చురుకుగా పాల్గొనే అరుణ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరం.

ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి,
ఎన్‌సీసీ లెఫ్టినెంట్ డాక్టర్ భవానీ

చేతికందిన కొడుకు రోడ్డు ప్రమాదంలో మృత్యువాతపడటంతో తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు.

రూ.20 వేలు ఇచ్చి భార్యను చంపించాడు

- ఇళ్లు, భూముల విషయంలో అడ్డు వస్తుందని ఘాతుకం
- మహిళ హత్య కేసులో ముగ్గురు అరెస్ట్
- వివరాలు వెల్లడించిన సీఐ కేశవులు


నిందితులను చూపుతున్న సీఐ కేశవులు

హవేళిఘణాపూర్(మెదక్): ఇళ్లు, భూమి విషయంలో అడ్డు వస్తుందని, రూ.20 వేలు సుపారీ ఇచ్చి అతికిరాతకంగా భార్యను హత్య చేయించాడు. ఈ కేసులో భర్తతోపాటు మరో ఇద్దరిని అరెస్టు చేసి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. మండల పరిధిలోని తొగిట గ్రామానికి చెందిన మంద సంగమణిని అతికిరాతకంగా నరికి చంపిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి వివరాలను మెదక్ రూరల్ సీఐ కేశవులు బుధవారం సమావేశంలో వెల్లడించారు. మంద ఆశయ్యకు ఇద్దరు భార్యలు ఉండగా ఇళ్లు, భూముల విషయమై తరుచూ గొడవలు జరుగుతుండేవి. అడ్డుగా ఉన్న మొదటి భార్యను చంపేస్తే ప్రశాంతంగా ఉండవచ్చని పథకం వేశాడు. సంగమణిని చంపితే రూ.20 వేలు ఇస్తానని, ఆమెను చంపి ఇంట్లో బీరువాలో ఉన్న డబ్బులను తీసుకెళ్లమని అదే గ్రామానికి చెందిన మహేశ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాడు. పథకం ప్రకారం ఈ నెల 11న భర్త ఆశయ్య, రెండవ భార్య మంజుల వారి బంధువుల వద్దకు వెళ్లారు. అదే రోజు రాత్రి 10.30 గంటల సమయంలో మహేశ్, తన స్నేహితుడు శివకుమార్‌తో కలిసి ఇంట్లోని ఈలపీటతో సంగమణి గొంతుపై, మొఖంపై కోసి చంపారు. అనంతరం బీరువాలో ఉన్న రూ.20 వేల నగదుతోపాటు ఒంటిపై ఉన్న పుస్తె, చెవి కమ్మలను కోసుకొని వెళ్లిపోయారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తుండగా మహేశ్, శివకుమార్‌ను అనుమానితులుగా గుర్తించి పట్టుకొని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు. వీరి ఇద్దరితోపాటు ఆశయ్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో హవేళిఘణాపూర్ ఎస్ఐ ఆనంద్‌గౌడ్, సిబ్బంది ఏఎస్ఐ సమి, మల్లేశం పాల్గొన్నారు.

రూ.2 వేలు ఇవ్వడం లేదని హత్యాయత్నం

నిందితుడు అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు

పటాన్‌చెరు టౌన్: హత్యాయత్నం కేసులో వ్యక్తిని రిమాండ్‌కు తరలించిన ఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి కథనం ప్రకారం.. బీహార్‌కు చెందిన సురాన్ కేవత్, అజయ్ కుమార్, మరో వ్యక్తి ముగ్గురు బతుకుదెరువు కోసం వచ్చారు. పటాన్‌చెరు మండలం ఘనపూర్ శివారు వేములకుంటలోని రాధా హిల్స్ వద్ద పనిచేసుకుంటూ ముగ్గురు ఒకేచోట ఉంటున్నారు. అయితే, సురాన్ కేవత్ నుంచి అజయ్ కుమార్ రూ.2 వేలు అప్పుగా తీసుకున్నాడు. సురాన్ కేవత్ డబ్బులు అడిగితే తిరిగి ఇవ్వక పోగా అజయ్ కుమార్ దుర్భాషలాడాడు. ఈ కోపంతో ఎలాగైనా అతడిని చంపాలని పథకం ప్రకారం సురాన్ కేవత్ సోమవారం మద్యం తీసుకొచ్చి అజయ్ కుమార్‌కు తాగించాడు. అనంతరం ఇనుప రాడ్‌తో దాడి చేసి పారిపోయాడు. రాధా హిల్స్ సూపర్ వైజర్ అక్తర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం రామచంద్రాపురం పరిధిలోని నాగులపల్లి రైల్వే స్టేషన్ వద్ద సురాన్ కేవత్‌ను అదుపులోకి తీసుకొని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

గడ్డి వాములు దగ్ధం

- రెండు పాడి గేదెలు మృతి
- చిలప్‌చెడ్ మండలం ఫైజాబాద్‌లో ఘటన


దగ్ధమైన గడ్డి వాము, గేదెల షెడ్డు

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రమాదమో.. దుండగుల పనో తెలియదు గాని ఒకేసారి మూడు గడ్డి వాములు, గేదెల షెడ్డు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో రెండు పాడి గేదెలు మృతి చెందగా మరో రెండు గేదెలకు తీవ్ర తీవ్రగాయాలు అయ్యాయి. ఈ ఘటన బుధవారం చిలప్‌చెడ్ మండలం ఫైజాబాద్‌లో చోటు చేసుకుంది. గ్రామస్తులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫైజాబాద్ గ్రామానికి చెందిన రైతు టేకుల నర్సింహా రెడ్డి రోజు మాదిరిగా మంగళవారం రాత్రి షెడ్డులో గేదెలను కట్టేసి వెళ్లాడు. అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరగడంతో షెడ్డులోని గడ్డి మోపులు దగ్ధం కాగా అందులో ఉన్న గేదెలకు మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు వచ్చి మంటలార్పారు. అప్పటికే రెండు గేదెలు మృతి చెందగా మరో రెండింటికి గాయాలు అయ్యాయి. రైతుకు రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లింది. దీంతోపాటు గ్రామానికి చెందిన మినుపురి పోచయ్యకు చెందిన 200 గడ్డిమోపులు, వంజరి మొగులయ్యకు చెందిన 60 గడ్డిమోపులు దగ్ధం అయ్యాయి. రైతులకు రూ.30 వేల వరకు నష్టం జరిగింది.

సమాజాన్ని మార్చుకుందాం

సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు భాస్కర్



లెనిన్ పుస్తకాన్ని సామూహికంగా అధ్యయనం చేస్తున్న సీపీఎం నాయకులు

దుబ్బాకటౌన్: మానవాళికి ప్రమాదకరంగా మారిన పెట్టుబడి దారి, సామ్రాజ్యవాద దేశాలకు వ్యతిరేకంగా సోషలిస్టు సమాజం నిర్మించడం కోసం లెనిన్ కృషి చేశాడని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గొడ్డుబర్ల భాస్కర్ అన్నారు. బుధవారం దుబ్బాకలోని సీపీఎం కార్యాలయంలో ఫిబ్రవరి 21 రెడ్ బుక్ డే సందర్భంగా లెనిన్ ఓ విప్లవ ఆయుధం పుస్తకాన్ని సామూహిక అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్టుబడి దారి వ్యవస్థను పతనం చేసి దాని స్థానంలో సోషలిజం అనే సాంఘిక సూత్రాన్ని ప్రజలకు అందించారన్నారు. కార్పొరేట్ మతతత్వ బీజేపీని దేశంలో ఓడిస్తే దేశ ప్రజలకు రక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సాధిక్, లక్ష్మీనర్సయ్య, ప్రశాంత్, సాజిద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

లెనిన్ స్ఫూర్తితో ఉద్యమించాలి

సిద్దిపేటఅర్బన్: ప్రజలను దోపిడీ నుండి విముక్తి చేసి సమసమాజ స్థాపనకు, సమాజ మార్పునకు లెనిన్ స్ఫూర్తితో ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాళ్లబండి శశిధర్ అన్నారు. లెనిన్ శత జయంతిని పురస్కరించుకొని లెనిన్ రచించిన పుస్తకాలను సామూహిక పఠనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు ప్రణాళికను ప్రజలకు అందించిన ఫిబ్రవరి 21న రెడ్ బుక్ డే జరుపుకుంటామన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గోపాలస్వామి, జిల్లా కమిటీ సభ్యులు రవికుమార్, ప్రశాంత్, శిరీష, బాలనర్సయ్య, నాయకులు ప్రభాకర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు జీతాలు చెల్లించాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య


వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

సిద్దిపేటరూరల్: జిల్లాలో సుమారు 45పైగా గ్రామ పంచాయతీ కార్మికులకు ఆరు నెలలుగా జీతాలు అందక ఇబ్బంది పడుతున్నారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య అన్నారు. బుధవారం కార్మికులకు జీతాలు చెల్లించాలని కోరుతూ కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ కు వినతి పత్రం అందజేశారు. పెరుగుతున్న ధరలు, నిత్యావసర ఖర్చులతో అర్ధాకలితో అలమటిస్తున్నామన్నారు. ప్రతీ నెలా ఇవ్వాల్సిన రెండు జతల డ్రెస్‌లు ఇవ్వడం లేదన్నారు. వెంటనే సమస్యలు ప రిష్కరించాలని లేకపోతే కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు నర్సింలు, యాదగిరి, బాబు, కనకవ్వ, యాదయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.